సాగుకు సమాయత్తం!

- పలకరించిన తొలకరి
- వ్యవసాయ పనుల్లో అన్నదాతలు బిజీబిజీ
- మండలంలో 10154 ఎకరాల్లో వరి సాగు


ఇసుకపల్లిలో వరి విత్తనాలు వెదజల్లుతున్న రైతు

కొత్తపల్లి: తొలకరి పలకరించింది. రుతుపవనాలు, అల్పపీడన ద్రోణి ప్రభావంతో కొద్దిరోజులుగా వర్షాలు పడటంతో రైతులు వరిసాగుకు సమాయత్తమయ్యారు. పిఠాపురం, పెద్దాపురం నియోజకవర్గాల్లోని రైతులు వ్యవసాయ పనుల్లో బిజీగా మారారు. ఈ ఏడాది రైతులు ఖరీఫ్‌లో వెదజల్లు విధానంలో సాగు చేసేందుకు ఆసక్తి చూపుతున్నారు. ఏళ్ల తరబడి సాంప్రదాయంగా వస్తున్న నాట్ల విధానానికి బదులు వెదజల్లు విధానాన్ని రైతులు ఎంచుకున్నారు. ముఖ్యంగా వ్యవసాయ శాఖ అధికారులు రైతులకు అవగాహన కల్పించడంతో వెదజల్లు సాగు వైపే రైతులు మొగ్గు చూపుతున్నారు.

కొత్తపల్లి మండలంలో..

కొత్తపల్లి మండలంలో ఈ ఏడాది సుమారు 10154 ఎకరాల్లో రైతులు ఖరీఫ్ వరి సాగు చేయనున్నారు. గతేడాది కంటే ఈ ఏడాది 50 శాతం మంది రైతులు అధికంగా వెదజల్లు విధానాన్ని అవలంభిస్తున్నారని వ్యవసాయధికారులు తెలిపారు. కాగా రైతులకు కొందరు వ్యాపారులు నకిలీ విత్తనాలు, ఎరువులను అంటగట్టి నిలువునా ముంచుతున్నారు. దీంతో రైతులు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు.

రైతులకు అవగాహన

గ్రామాల్లో రైతులకు వెదజల్లు పద్ధతిపై అధికారులు అవగాహన కల్పిస్తున్నారు. ఈ విధానంలో సానుకూల అంశాలు, లాభాలను రైతులకు వివరిస్తున్నారు. దీనిపై అవగాహన పెంచుకున్న రైతులు ఈసారి కూలీల కొరతను అధిగమించేందుకు వెదజల్లు పద్ధతి వైపు మొగ్గు చూపుతున్నారు.

కూలీల కొరత

తొలకరిలో పుష్కలంగా వర్షాలు కురిస్తే రైతులకు సాగునీటి ఇబ్బందులు ఉండవు. దీంతో రైతులు సాంప్రదాయ నారుమళ్లు, నాట్లు వేసే పద్ధతిని అవలంబిస్తారు. కొద్ది సంవత్సరాలుగా పశ్చిమబెంగాల్ రాష్ట్రంతో పాటు, శ్రీకాకుళం, విజయనగరం జిల్లాల నుంచి వలస కూలీలు భారీగా ఇక్కడికి వచ్చి వరి నాట్లు వేస్తున్నారు. స్థానికంగా ఉన్న కూలీల కొరతను అధిగమించేందుకు రైతులందరూ వారిపైనే ఆధారపడుతున్నారు. ఈ ఏడాది అక్కడ నుంచి వలస కూలీలు వచ్చే పరిస్థితి కనిపించడం లేదు. దీంతో కూలీల కొరత ఏర్పడుతుంది. దీనిని అధిగమించేందుకు రైతులు వెదజల్లు సాగును ఎంచుకున్నారు. రైతులు తమ పొలాలను దమ్ముచేసి విత్తనాలు వెదజల్లుతున్నారు.


విత్తనాలు శుద్ధి చేస్తున్న రైతులు

తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు



వెదజల్లు విధానంలో సాగు చేస్తే పెట్టుబడి ఖర్చు బాగా తగ్గుతుంది. ఎకరాకు 10 నుంచి 12 కిలోల విత్తనాలతో పాటు సాగు నీరు కూడా అదా అవుతుంది. పంట కాలం వారం నుంచి 10 రోజులు తగ్గుతుంది. దీంతో రెండో పంట త్వరగా వేసుకోవచ్చు. వెదజల్లు పద్ధతిలో కూలీల సమస్యను అదిగమించవచ్చు. ఈసారి అధికశాతం మంది రైతులు వెదజల్లు విధానంలో సాగు చేస్తున్నారు. ముఖ్యంగా వెదజల్లులో కలుపు నివారణ చర్యలు చేపట్టాలి. 30 నుంచి 40 రోజుల తరువాత పొలాన్ని నీరు లేకుండా ఆరబెట్టడం వలన దుబ్బువేరు వ్యవస్థ బలపడుతుంది. రైతులు వ్యవసాయశాఖ అధికారుల సూచనలు, సలహాలు పాటించి సాగు చేపట్టాలి.

– వి.జోగిరాజు,
మండల వ్యవసాయాధికారి, కొత్తపల్లి

లోక్ అదాలత్‌లో 264 కేసులు పరిష్కారం


పెద్దాపురంలో లోక్ అదాలత్ నిర్వహిస్తున్న జడ్జి చంద్రమౌళీశ్వరి


పిఠాపురంలో లోక్ అదాలత్ నిర్వహిస్తున్న అధికారులు

పెద్దాపురం: స్థానిక కోర్టు ఆవరణలో శనివారం నిర్వహించిన జాతీయ స్థాయి లోక్ అదాలత్‌లో 253 కేసులు పరిష్కరించినట్లు ఏడో అదనపు జిల్లా జడ్జి చంద్రమౌళీశ్వరి తెలిపారు. శనివారం స్థానిక కోర్టు మూడు బెంచ్‌ల్లో న్యాయమూర్తులు దీపా దివ్యకృప, హర్షవర్ధన్‌లు లోక్ అదాలత్ కేసులు పరిష్కరించారు. ఈ సందర్భంగా సివిల్ కేసులు 43కు రూ.88,07,244, క్రిమినల్ కేసులు 67, ఐదు మోటారు వాహనాల ప్రమాదాల కేసులకు రూ.32,05,000, ప్రీ లిటిగిషన్ బ్యాంక్ కేసులు రెండుకు రూ.43,000, బిఎస్ఎన్ఎల్ కేసులు 8కి గాను రూ.20,078, క్రిమినల్ చలానా కేసులు 128కి రూ.55,300 పరిష్కరించినట్లు జడ్జి జి.చంద్రమౌళీశ్వరి తెలిపారు. కార్యక్రమంలో మానవ హక్కుల సంఘం నాయకులు నూతలపాటి అప్పలకొండ, న్యాయవాదులు, కక్షిదారులు పాల్గొన్నారు.

పిఠాపురంలో..

పిఠాపురం: స్థానిక కోర్టు ఆవరణలో 12వ అదనపు జిల్లా జడ్జి ఎ.వాసంతి పర్యవేక్షణలో శనివారం జాతీయ లోక్ అదాలత్ నిర్వహించారు. రోడ్డు ప్రమాదంలో భర్తను కోల్పోయిన బాధితురాలికి రూ.50 లక్షల నష్టపరిహారం ఇన్సురెన్స్ కంపెనీ ద్వారా అందజేశారు. సివిల్, క్రిమినల్, మోటర్ వెహికల్, మెయింటెనెన్స్ తదితర కేసులను పరిష్కరించారు. కార్యక్రమంలో సీనియర్ సివిల్ జడ్జ్ బాబు, జూనియర్ సివిల్ జడ్జ్ విజయ రామేశ్వరి, న్యాయనాదులు వీరభద్రరావు, ఇన్సూరెన్స్ సంస్థ స్టాండింగ్ కౌన్సిల్ న్యాయవాది రాధాకృష్ణ, వైవీఎస్ మూర్తి తదితరులు పాల్గొన్నారు.

నిబద్ధతతో ఉద్యోగులకు గుర్తింపు


ఈఓ పీఆర్‌డీ రాజశేఖర్‌ను సత్కరిస్తున్న ఎంపీడీఓ, సిబ్బంది

పెద్దాపురం: ప్రజా సేవలందించడంలో నీతి, నిబద్ధతో కూడిన ప్రతి ఉద్యోగికి మంచి గుర్తింపు లభిస్తుందని ఎంపీడీఓ ఎం.ఉషారాణి అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శనివారం మండల విస్తరణాధికారి కాగితాల రాజశేఖర్ పదవీ విరమణ సందర్భంగా మండల పరిషత్ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శుల ఆధ్వర్యంలో సత్కార సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ కార్యాలయ పరిపాలనాధికారి సత్యనారాయణమూర్తి అధ్యక్షతన జరిగిన సత్కార సభలో ఎంపీడీఓ ఉషారాణి మాట్లాడుతూ రాజశేఖర్ సేవలు అభినందనీయమన్నారు. మండల స్థాయిలో సేవలందిస్తూ నియోజకవర్గ స్థాయిలో మంచి గుర్తింపు తెచ్చుకున్న వ్యక్తి రాజశేఖర్ అన్నారు. సూపరింటెండెంట్ మూర్తి, పంచాయతీ కార్యదర్శులు రమణ, జ్యోతుల పద్మరాజు, నక్కా సత్యనారాయణమూర్తి, భారతి మాట్లాడుతూ రాజశేఖర్ ఎంతోమంది ఉద్యోగులకు ఆదర్శప్రాయంగా నిలుస్తారన్నారు. అనంతరం ఈఓపీఆర్‌డీ రాజశేఖర్, నిర్మల దంపతులను ఘనంగా సత్కరించారు. తొలుత పంచాయతీ కార్యదర్శులు ఎంపీడీఓ ఉషారాణి పుట్టిన రోజు కేక్‌ను కట్ చేయించారు. హౌసింగ్ ఏఈ సురేష్, పంచాయతీ కార్యదర్శులు సుభాని, ఈశ్వరరావు, భార్గవ్, వరసాల శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

విజ్ఞానదాయకంగా కెమెరాల ప్రదర్శన


పురాతన కెమెరా ప్రదర్శనను ప్రారంభిస్తున్న సీనియర్ ఫొటోగ్రాఫర్ జగన్నాథం

బోట్‌క్లబ్: జాతీయ కెమెరాల దినోత్సవం సందర్భంగా కాకినాడ కెమెరా క్లబ్, ప్రొఫెషనల్ ఫొటోగ్రాఫర్స్ అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యంలో స్థానిక టౌన్ హాల్ సమావేశ మందిరంలో పురాతన కెమెరాల ప్రదర్శన శనివారం నిర్వహించారు. సీనియర్ ఫొటోగ్రాఫర్ బళ్ల జగన్నాథం ఈ ప్రదర్శనను ప్రారంభించి ఇటువంటి ప్రదర్శన ద్వారా కెమెరాల ఆకారాలు, విశేషాలు నేటి తరానికి తెలుసుకోవడానికి ఎంతో వీలు ఉందన్నారు. నాటి కెమెరాలతో తీసిన ఫొటోలకు ప్రత్యేక గుర్తింపు ఉంటుందన్నారు. కాకినాడ కెమెరా క్లబ్ కార్యదర్శి కర్రి నాగేశ్వరరావు మాట్లాడుతూ ఈ ప్రదర్శనలో సుమారు 150 ఏళ్ల నాటి కెమెరాలు కూడా ఉన్నాయన్నారు. తమ క్లబ్ సభ్యులు రామచంద్రపురం స్టూడియో అధినేత వి.బాలకృష్ణ ఆధ్వర్యంలో సేకరించిన సుమారు 500 కెమెరాలను, వీడియో కెమెరాలు కూడా ఈ ప్రదర్శనలో చూడవచ్చని అన్నారు. కాకినాడ కెమెరా క్లబ్ ఏర్పడి సుమారు 53 ఏళ్లు అవుతోందని, ఏటా క్రమం తప్పకుండా జాతీయ కెమెరా దినోత్సవాన్ని నిర్వహిస్తున్నట్టు తెలిపారు. కాకినాడ కెమెరా క్లబ్‌ను 1971లో అప్పటి జిల్లా కలెక్టర్ మాల కొండయ్య అధ్యక్షతన వైద్యులు, ఇంజినీర్లు, ప్రొఫెసర్లు, కెమెరామెన్ సంయుక్తంగా ఏర్పాటు చేశారన్నారు. కార్యక్రమంలో కాకినాడ కెమెరా క్లబ్ అధ్యక్షులు ఎస్‌వీఎస్ఎస్ రామమూర్తి, ఉపాధ్యక్షులు డాక్టర్ శివరామకృష్ణ, సంయుక్త కార్యదర్శి జేవీఎస్‌వీ ప్రసాద్, కోశాధికారి నేరేడు సోమరాజు, ప్రొఫెషనల్ ఫొటోగ్రాఫర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు తోట సూర్య సుబ్బారావు, గౌరవ అధ్యక్షులు జశ్వంత్ శ్రీను పాల్గొన్నారు.

కౌలు రైతు కార్డుల జారీ వేగవంతం చేయండి


సమీక్షలో మాట్లాడుతున్న ఆర్డీఓ రామారావు

పెద్దాపురం: డివిజన్ వ్యాప్తంగా చేపట్టే కౌలు రైతుల కార్డుల (సీసీఆర్‌సీ) జారీ ప్రక్రియను మరింత వేగవంతం చేయాలని ఆర్డీఓ జేఎస్ రామారావు ఆయా మండలాల తహసీల్దార్లను ఆదేశించారు. స్థానిక ఆర్డీఓ కార్యాలయ సమావేశపు మందిరంలో శనివారం డివిజన్‌లోని 12 మండలాల తహసీల్దార్లు, వ్యవసాయ అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆర్డీఓ మాట్లాడుతూ రెవెన్యూ సేవలను మరింత విస్తృతం చేయాలన్నారు. ప్రజలకు అందుబాటులో ఉండి సేవలందించాలన్నారు. గ్రామాల్లో జరుగుతున్న రేషన్ పంపిణీ ప్రక్రియపై తహసల్దార్లు ఎప్పటికప్పుడు సమీక్షించాలన్నారు. అనంతరం పలు అంశాలపై సమీక్షించారు. ఈ కార్యక్రమంలో కార్యాలయ డీటీ భానుకుమార్, తహసీల్దార్ శ్రీనివాసరెడ్డి, ఆయా మండలాల తహసీల్దార్లు, వ్యవసాయాధికారులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కలసి పని చేయాలి

- కౌన్సిల్ సమావేశంలో ఎమ్మెల్యే రాజప్ప
- ఎమ్మెల్యేను సత్కరించిన చైర్‌పర్సన్, కౌన్సిలర్లు
- ఐదేళ్ల నాటి బిల్లు చెల్లింపు అంశం వాయిదా


కౌన్సిల్ సమావేశంలో మాట్లాడుతున్న ఆవాల లక్ష్మీనారాయణ, ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే చినరాజప్ప

సామర్లకోట: ప్రజా సమస్యల పరిష్కారానికి కలిసి పని చేయాలని ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప అన్నారు. మున్సిపల్ చైర్ పర్సన్ గంగిరెడ్డి అరుణ అధ్యక్షతన జరిగిన కౌన్సిల్ సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. సమావేశానికి హాజరైన ఆయనను చైర్‌పర్సన్ గంగిరెడ్డి అరుణ, వైస్ చైర్మన్లు ఉబా జాన్‌మోజెస్, గోకిన సునేత్రాదేవి, కౌన్సిలర్లు సత్కరించారు. అజెండా ప్రారంభించే ముందు జీరో అవర్ ఇవ్వాలని అధికార పక్ష సభ్యుడు కరణం రాజ్‌కుమార్ కోరారు. అజెండా పూర్తి అయిన తరువాత ఇస్తామని చైర్ పర్సన్ తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాజప్ప మాట్లాడుతూ ప్రజలు కౌన్సిలర్లుగా మీకు, ఎమ్మెల్యేగా నాకు ఇచ్చిన గౌరవాన్ని కాపాడుకుంటూ వారి అవసరాలు తీర్చాలన్నారు. మున్సిపాలిటీ అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని ఆయన హామీ ఇచ్చారు. మున్సిపాలిటీ పరిధిలో గతంలో ఏర్పాటు చేసిన అన్న క్యాంటిన్‌ను త్వరలో ప్రారంభిస్తున్న నేపథ్యంలో స్కూల్ మార్పుకు కౌన్సిల్ తీర్మానం తీసుకోవాలన్నారు. స్టేషన్ సెంటర్‌లోని గడియారం స్తంభం పనులు ప్రారంభించడంతో పాటు, డ్రైన్లు, రోడ్ల పనులకు కృషి చేస్తానని చెప్పారు. మున్సిపాలిటీ అభివృద్ధికి అవసరమైన నిధులు తీసుకు వస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు.

ఆన్‌లైన్ బిల్డింగ్ ప్లాన్‌ల అంశం వాయిదా

ఆన్‌లైన్ బిల్డింగ్ ప్లాన్‌లకు సంబంధించి ఒక వ్యక్తి 190 రోజులు పని చేసినందుకు రూ.3.73 లక్షలు చెల్లించాలని అజెండాలోనికి తీసుకు రావడం వింతగా ఉన్నదని, ఆ అంశాన్ని వాయిదా వేయాలని అధికార పక్ష కౌన్సిలర్ ఆవాల లక్ష్మీనారాయణ సూచించారు. 2019లో పూర్తి అయిన పనికి ఐదేళ్లు గడిచిన తరువాత కౌన్సిల్ తీసుకురావడం ఏమిటని ఆయన ప్రశ్నించారు. రాష్ట్ర డైరెక్టర్ ఆఫ్ టౌన్ అండ్ కంట్రీ ప్లానింగ్ లేఖ మేరకు ఈ మొత్తం తీసుకువచ్చినట్టు టీపీఓ ఫణికుమార్ తెలిపారు. దీనికి సంబంధించి పూర్తి వివరాలతో కౌన్సిల్ దృష్టికి తీసుకు రావాలని ఆవాల డిమాండ్ చేశారు. దీనిపై కమిషనర్ సమాధానం ఇవ్వాలని ఎమ్మెల్యే సూచించారు. వచ్చే కౌన్సిల్ సమావేశంలో పూర్తి వివరాలు అందజేస్తామని కమిషనర్ జె రామారావు తెలిపారు. మిరియాల రాజు అనే పీహెచ్ కార్మికుడి రూ.5 లక్షల ఎక్స్‌గ్రేషియా విషయమై జరిగిన చర్చలో మున్సిపల్ సాధారణ నిధుల నుంచి చెల్లించేలా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే సూచించారు. ఒకే వార్డుకు మూడు అభివృద్ధి పనులను అజెండాలో పెట్టడంపై అభ్యంతరం వ్యక్తం చేసిన పిల్లాడి సత్యవతి వాదనను ఎమ్మెల్యే అడ్డుకుని మీ వార్డుకు ఏం కావాలో కేవలం అదే అడగాలని సూచించారు. దీంతో ఆమె తమ వార్డుకు గేటు కావలని కోరడంతో లేఖ ఇస్తే సమస్య పరిష్కరిస్తామని కమిషనర్ హామీ ఇచ్చారు.

ఆమోదయోగ్య అంశాలే అజెండాలో ఉంచాలి..

మున్సిపాలిటీ పరిధిలోని అన్ని వార్డుల కౌన్సిలర్లతో చర్చించి వారి ఆమోదంతో మాత్రమే అజెండాలోనికి అంశాలు తీసుకురావాలని ఎమ్మెల్యే సూచించారు. అజెండాలోనికి అంశాలు వచ్చిన తరువాత వాటిని తిరస్కరించడం మంచి పద్ధతి కాదని ఎమ్మెల్యే అన్నారు. ఈ మేరకు అధికారులు కౌన్సిలర్ల సమక్షంలో సమావేశం ఏర్పాటు చేసి అజెండాను తయారు చేయాలన్నారు. ఈ సమావేశంలో మున్సిపల్ కో ఆప్షన్ సభ్యుడు మన్యం చంద్రరావు, అధికార, ప్రతిపక్ష సభ్యులు, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

గతం గతః.. అభివృద్ధికి కృషి చేద్దాం

- పెద్దాపురం మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో ఎమ్మెల్యే చినరాజప్ప


కౌన్సిల్ సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే చిన రాజప్ప, చైర్మన్

పెద్దాపురం: గతం గతః. జరగాల్సిన అభివృద్ధిపై కౌన్సిల్, అధికారులు దృష్టిపెట్టాలని ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప పేర్కొన్నారు. పెద్దాపురం మున్సిపల్ కౌన్సిల్ సమావేశం శనివారం మున్సిపల్ చైర్ పర్సన్ బొడ్డు తులసీ మంగతాయారు అధ్యక్షతన జరిగింది. స్థానిక శతాబ్ది పార్కు అభివృద్ధిలో మున్సిపల్ అధికారుల నిర్లక్ష్యం దారుణమని అధికారులపై కౌన్సిల్ ఆగ్రహం వ్యక్తం చేసింది. కౌన్సిలర్ విజ్జపు రాజశేఖర్ మాట్లాడుతూ గోదావరి మంచినీటి బూస్టర్ లైన్ వద్ద లీకేజీల వల్ల నీటి సరఫరా నిలిపివేశాని, లీకులను సత్వరమే అరికట్టి నీటి సరఫరా పునరుద్ధరించాలన్నారు. పట్టణంలోని కమ్యూనిటీ భవనాలకు విద్యుత్ బిల్లులను ఆ నిర్వాహకులే చెల్లించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. కౌన్సిలర్లు ఆకుల కృష్ణ బాపూజీ, విడదాసరి రాజా, పప్పల దుర్గారావు మాట్లాడుతూ పట్టణంలో పారిశుధ్యం క్షీణించిందని, రానున్న మరిడమ్మ జాతర సమయానికి పారిశుధ్యాన్ని మెరుగుపరచాలని కోరారు. టీడీపీ కౌన్సిలర్ శ్రీనివాస్ మాట్లాడుతూ ఐదేళ్లలో మున్సిపల్ పార్కు అభివృద్ధి పాలకులకు పట్టలేదా అని నిలదీయడంతో వైస్ చైర్మన్ సాయి ప్రసాద్ కలుగ జేసుకుని గత టీడీపీ ప్రభుత్వ హాయంలో పార్కును ఓ కాంట్రాక్టర్‌కు గుడా ద్వారా అప్పగిస్తే అధ్వానంగా చేశారన్న విషయం మీకు తెలియదా అన్నారు. ఇంతలో ఎమ్మెల్యే రాజప్ప కలగజేసుకుని గతం వదిలేయండి, పార్కు అభివృద్ధికి అందరూ కలసి ముందడుగు వేద్దామన్నారు. మున్సిపల్ నిధులు సరిపోకపోతే ప్రభుత్వ నిధుల ద్వారా పార్కు అభివృద్ధితో పాటు గుర్రాల సెంటర్‌ను మరింత అభివృద్ధి చేస్తామని రాజప్ప అన్నారు. చైర్‌పర్సన్ బొడ్డు తులసీ మంగతాయారు మాట్లాడుతూ సీజనల్ వ్యాధులతో యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ కనకాల మహాలక్ష్మి, మున్సిపల్ మాజీ చైర్మన్ ముప్పన శ్యామలాంబ, కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

నేడు హనుమాన్ శోభాయాత్ర

సామర్లకోట: రెండు మున్సిపాలిటీల పరిధిలో ఆదివారం సాయంత్రం హనుమాన్ శోభాయాత్ర నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు పి.ప్రభాకర్, జీవీకె మోహన్‌రావు, ఎ.శివయ్య, అల్లు ప్రసాద్, కర్రి ఆదినారాయణరెడ్డి తెలిపారు. శనివారం వారు విలేకర్లతో మాట్లాడుతూ వేలాది మంది భక్తులతో సాగే మోటారు సైకిల్ శోభాయాత్ర ర్యాలీని స్థానిక ప్రసన్నాంజనేయ స్వామి ఆలయం వద్ద ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప ప్రారంభిస్తారని తెలిపారు. ప్రసన్నాంజనేయ స్వామి ఆలయం, ఇండస్ట్రియల్ ఎస్టేట్, ప్రత్తిపాడు జంక్షన్, బ్రౌన్‌పేట జంక్షన్, పాత తహసీల్దార్ కార్యాలయం, గాంధీచౌక్, స్టేషన్ సెంటర్, మఠంసెంటర్, మెహర్‌కాంప్లెక్స్ మీదుగా తిరిగి ప్రసన్నాంజనేయ స్వామి ఆలయం సెంటర్‌కు శోభాయాత్ర చేరుతుందన్నారు. అక్కడి నుంచి పెద్దాపురం పట్టణంలో శోభాయాత్ర నిర్వహిస్తామని చెప్పారు. ఆర్ఎస్ఎస్ ఆంధ్రప్రదేశ్ ప్రాంత కార్యకారణి సభ్యుడు ఓలేటి సత్యనారాయణ ముఖ్య వక్తగా వ్యవహరిస్తారని తెలిపారు. ఆసక్తి గలవారు శోభాయాత్ర బైక్ ర్యాలీలో పాల్గొన్నాలని వారు పిలుపు నిచ్చారు.

విశ్రాంత ఉపాధ్యాయుడికి సత్కారం


విశ్రాంత ఉపాధాయుడు ఆనంద్ కుమార్‌ను సత్కరిస్తున్న ఎంఈఓ, పాఠశాల సిబ్బంది

కొత్తపల్లి: విద్యార్థులను ఉత్తమంగా తీర్చిదిద్ది, వారి భవితకు బాటలు వేసేది ఉపాధ్యాయులేనని మండల విద్యాశాఖాధికారి వేణుగోపాల్ అన్నారు. మండలంలోని వాకతిప్ప జిల్లా పరిషత్ పాఠశాలలో హెచ్‌ఎంగా పనిచేసి ఉద్యోగ విరమణ పొందిన కడరీ జాషువా ఆనంద్‌కుమార్‌ను శనివారం ఇంచార్జి హెచ్‌ఎం కృపారావు ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా వేణుగోపాల్ మాట్లాడుతూ తాను పాఠాలు చెప్పిన విద్యార్థులు ఉన్నత ఉద్యోగాలు సాధించి, రాజకీయ నాయకులుగా మారడం ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో మండల విద్యాశాఖాధికారి-2 జి.పెదిరాజు, వైఎస్సార్ సీపీ నాయకుడు రావు చిన్నారావు, ఎంపీటీసీ దాకే నాగమహేశ్వరి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వర్షంలోనూ కొనసాగిన నిరసన



నిరసన తెలియజేస్తున్న కార్మికులు

సామర్లకోట: స్థానిక ఏడీబీ రోడ్డులోని రాక్ సిరామిక్స్ నుంచి తొలగించబడిన కార్మికులు వర్షంలోనూ వారి నిరసన తెలియజేశారు. సీఐటీయూ జిల్లా కార్యదర్శి క్రాంతికుమార్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యేకు వినతి పత్రం అందజేశారు. 18 ఏళ్లుగా పని చేస్తున్న కార్మికులను ఎటువంటి నోటీసు ఇవ్వకుండా ఏప్రిల్ 15న నిలిపి వేశారని కార్మికులు ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి క్రాంతికుమార్, కార్మికులు చంద్రశేఖర్, గంగాధర్, సతీష్, రామకృష్ణ, వరప్రసాద్, సుబ్బారావు, శివనారాయణ, సతీష్‌కుమార్, రాజబాబు, రామచంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

సీహెచ్‌సీలో పారిశుధ్య పనులు

సామర్లకోట: స్థానిక కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో శనివారం ప్రత్యేక పారిశుధ్య పనులు నిర్వహించారు. శుక్రవారం మున్సిపల్ కౌన్సిల్ ఆస్పత్రిని సందర్శించిన సమయంలో ఆస్పత్రి ఆవరణలో బ్లీచింగ్ పిచికారీ చేసిన ఆనవాళ్లు లేకపోవడంతో ఆ వార్డు కౌన్సిలర్ రెడ్డి లోవకుమారి ఆధ్వర్యంలో శనివారం ప్రత్యేక శానిటేషన్ నిర్వహించారు. ఈ పనులను డాక్టరు వైఎస్సార్ యువసేన ఉమ్మడి జిల్లా కార్యదర్శి రెడ్డి శ్రీనివాసరావు పర్యవేక్షించారు.

ప్రపంచాన్ని సన్మార్గంలో నడిపించేది భారతదేశం


సమరసత సేవా ఫౌండేషన్ సమావేశంలో పాల్గొన్న సభ్యులు

పిఠాపురం: ప్రపంచాన్ని సన్మార్గంలో నడిపించేది భారతదేశం ఒక్కటేనని గోదావరి జోన్ ధర్మ ప్రచారక్ తోట జగన్నాథం అన్నారు. గొల్లప్రోలు కరణంగారి తోటలో ఉన్న షిర్డీ సాయిబాబా గొల్లపూడి మండపంలో శనివారం సమరసత సేవా ఫౌండేషన్ జిల్లా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ధర్మ ప్రచారక్ పడాల రఘు మాట్లాడుతూ మానవుడు మహనీయుడిగా మారాలంటే భారతీయ సంస్కృతి, సంప్రదాయాలను పాటించాలన్నారు. కార్యక్రమంలో కొప్పన కోటేశ్వరరావు, అదట్రా వరహాలుబాబు, శింగన సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఒకటి నుంచి పెంచిన పింఛన్ల పంపిణీ

సామర్లకోట: జూలై ఒకటి నుంచి పెంచిన సామాజిక పింఛన్ల పంపిణీ చేయనున్నట్లు ఎంపీడీఓ ఎన్‌డీ శ్యామ్‌సుందర్, మున్సిపల్ కమిషనర్ జె.రామారావు తెలిపారు. మండల పరిధిలో 11,880 సామాజిక పింఛనుదారులు ఉండగా వీరిలో 1324 మంది దివ్యాంగ పింఛనుదారులు ఉన్నారని తెలిపారు. ఏప్రిల్ ఒకటో తేదీ నుంచి పెంచిన రూ.4 వేలు పింఛను అమలులోనికి వచ్చిందన్నారు. అలాగే మున్సిపాలిటీ పరిధిలో 6,508 మంది సామాజిక పింఛనుదారులు ఉన్నారన్నారు.

విద్యార్థులను క్రీడల్లోనూ ప్రోత్సహించాలి

సామర్లకోట: విద్యార్థులకు చదువుతో పాటు క్రీడల్లోనూ ప్రోత్సహించాలని ఉపాధ్యాయులు, తల్లిదండ్రులకు ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప సూచించారు. స్థానిక బచ్చు ఫౌండేషన్ మున్సిపల్ హైస్కూల్ హెచ్‌ఎం తోటకూర సాయి రామకృష్ణ అధ్యక్షతన పీడీ తాళ్లూరి వైకుంఠం పదవీ విరమణ సభ నిర్వహించారు. ఆదివారం వైకుంఠం పదవీ విరమణ చేయనున్న నేపథ్యంలో నిర్వహించిన సభకు ఎమ్మెల్యే చినరాజప్ప ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ క్రమశిక్షణకు మారు పేరుగా అనేక మంది కబడ్డీ, ఖోఖో క్రీడాకారులను ఆయన తయారు చేశారని తెలిపారు. పట్టణం కబడ్డీ క్రీడాకారులకు పుట్టినిల్లుగా గుర్తింపు పొందడంతో రాష్ట్ర స్థాయి టోర్నమెంట్ ఏర్పాటు చేయాలని పీఈటీలు, క్రీడాకారులకు ఎమ్మెల్యే సూచించారు. ఉద్యోగం సంపాదించిన పాఠశాలలోనే 34 ఏళ్లు పని చేసి పదవీ విరమణ చేయడం అభినందనీయమని హెచ్‌ఎం రామకృష్ణ అన్నారు. కమిషనర్ జె.రామారావు, ఎంఈఓలు వై.శివరామకృష్ణయ్య, పి.పుల్లయ్య, విశ్రాంత ఉమ్మడి రాష్ట్ర కబడ్డీ కోచ్ పోతుల ప్రసాద్ తదితరులు వైకుంఠం దంపతులను ఘనంగా సత్కరించారు.

నేడు చిత్రలేఖన పోటీలు


వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న శ్రీనివాస్ తదితరులు


పెద్దాపురం: పెద్దాపురం చిల్డ్రన్ క్లబ్ (పీసీసీ) ఆధ్వర్యంలో ఈ నెల 30 తేదీన పర్యావరణ చిత్రలేఖన పోటీలు నిర్వహించనున్నట్టు పీసీసీ గౌరవాధ్యక్షులు బుద్ధా శ్రీనివాస్ తెలిపారు. స్థానిక వరహాలయ్యపేట యాసలపు సూర్యారావు భవనంలో శనివారం చిత్రలేఖన పోటీల వాల్‌పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు. అల్లూరి సీతారామరాజు జయంతి సందర్భంగా పోటీలు నిర్వహిస్తున్నామని, 30వ తేదీ మధ్యాహ్నం రెండు గంటల నుంచి పోటీలు ఉంటాయన్నారు. విద్యార్థులు 90006 95301, 79016 97939 నెంబర్లను సంప్రదించాలని ఆయన కోరారు.

రాయడం, చదవడంపై శ్రద్ధ చూపాలి


విద్యార్థులతో గ్రీన్ బోర్డుపై అక్షరాలు చదివిస్తున్న ఎంఈఓ శివరామకృష్ణయ్య

సామర్లకోట: ప్రాథమిక స్థాయి నుంచి విద్యార్థులు రాయడం, చదవడంపై ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని ఎంఈఓ వై.శివరామకృష్ణయ్య అన్నారు. నేను బడికి పోతా కార్యక్రమంలో భాగంగా శనివారం స్థానిక జగ్గమ్మగారిపేట ఎలిమెంటరీ పాఠశాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థుల నోట్ పుస్తకాలలో చేతి రాతను పరిశీలించారు. పాఠశాలలోని తాగునీరు, మరుగుదొడ్లు, పరిసరాలను పరిశీలించారు. మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి ప్రతి విద్యార్థీ పాఠశాలలోనే భోజనం చేసేలా అవగాహన పెంచాలన్నారు. పాఠశాల ఎన్‌రోల్‌మెంట్ డ్రైవ్‌ను ఎంఈఓ పరిశీలించి బడి బయట పిల్లలు లేకుండా చూడాలన్నారు.

జెడ్పీ హైస్కూల్‌కు ఆట వస్తువులు


పాఠశాలకు క్రీడా సామగ్రి అందజేసిన ఫౌండేషన్ చైర్మన్

సామర్లకోట: మాధవపట్నం జెడ్పీ హైస్కూల్ విద్యార్థులలో క్రీడా స్ఫూర్తి పెంచడానికి సానా సతీష్ కుమార్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో క్రీడా సామాగ్రి అందజేశారు. ఫౌండేషన్ చైర్మన్ తలాటం హరిష్ క్రీడా సామగ్రిని పాఠశాల హెచ్‌ఎం గోవిందరాజులు అందజేశారు. అలాగే స్కూల్ క్రీడా మైదానం అభివృద్ధికి ఫౌండేషన్ బాధ్యత తీసుకొంటుదన్నారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు ఫౌండేషన్ చైర్మన్‌ను సత్కరించారు. పీఈటీ గోవిందు, ట్రస్టు సభ్యుడు వీరబాబు, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

జూలై 3న ఇండియన్ క్రిస్టియన్ డే

నాగమల్లితోట జంక్షన్ (కాకినాడ సిటీ): క్రాంతి టీవీ, హౌస్ఆఫ్ ప్రేయర్ ఆధ్వర్యంలో జూలై 3న ఇండియన్ క్రిస్టియన్ డే వేడుకలు నిర్వహిస్తున్నట్లు ఆల్‌ఇండియా క్రిస్టియన్ కౌన్సిల్ కాకినాడ శాఖ అధ్యక్షుడు రిక్కిగూటం శనివారం తెలిపారు. స్థానిక మెక్లారిన్ గ్రౌండ్స్‌లో 3వ తేదీ సాయంత్రం 6 గంటలకు నిర్వహించే ఈ వేడుకలకు ముఖ్య అతిథిగా విజయవాడ క్రైస్ట్ టెంపుల్ సంఘ పాస్టర్ రెవ డాక్టర్ పాల్ ఇమ్మానుయేలు వచ్చి దైవ సందేశం అందిస్తారన్నారు.